బనకచర్లపై సిఎం స్పష్టతనివ్వాలి

- రాష్ట్రాల మధ్య కేంద్రం వివాదాలు సృష్టించే ప్రయత్నం
- బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం కాలయాపన
- ఎలాంటి అడ్డంకులూ లేకుండా ఆర్డినెన్స్ తేవాలి
- కులాంతర వివాహ చట్టం తేవాలి : జాన్‌వెస్లీ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బనకచర్లపై సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో బనకచర్లపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చలు జరిపారని, కొన్ని నిర్ణయాలు జరిగాయని ఎపి ఇరిగేషన్ మంత్రి రామానాయుడు ప్రకటన చేసిన నేపథ్యంలో.. అసలు చర్చలు జరిగాయా? లేదా? స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత సీఎంపై ఉందన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బనకచర్లపై గందరగోళాన్ని తొలగించే విధంగా నిపుణులతో చర్చించి అఖిలపక్షంతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. బనకచర్లపై సమావేశం జరిగి ఉంటే అక్కడ తీసుకున్న నిర్ణయాలు, రాష్ట్రానికి వరద, మిగులు జలాలపై స్పష్టమైన వాటాలను తేల్చాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల మధ్య వివాదాలు సృష్టించి రాజకీయ లబ్ది పొందాలని చూస్తోందని విమర్శించారు.

రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి కేంద్రానికి పంపగా.. మూడు నెలల్లోపు తేల్చాలని సుప్రీంకోర్టు సూచించిందని అన్నారు. ఈ విషయంలో ఇప్పటి వరకు రాష్ట్రపతి ఆమోదం తెలపలేదన్నారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. బీసీల రిజర్వేషన్లపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో వ్యతిరేకంగా ఉందని అర్థమవుతోందన్నారు. కులగణన విషయంలో కేంద్రం ఎలాంటి వైఖరి అవలంబించిందో చూశామన్నారు. రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు బిసి రిజర్వేషన్‌పై ప్రధాన మంత్రిపై ఒత్తిడి తేవాలని, ప్రయోజనకర అంశాలపై మాట్లాడాలని, బిల్లుపై వారు కూడా స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు ఎలాంటి అడ్డంకులూ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ కోసం జెఎసి ఆధ్వర్యంలో ఆందోళనలు జరుగుతున్నాయన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకొచ్చి 18 నెలలు అవుతున్నా ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించలేదని విమర్శించారు.

గత ప్రభుత్వం వేసిన నోటిఫికేషన్ల ఉద్యోగాలు ఇచ్చారు తప్ప కొత్తగా ఒక్క నోటిఫికేషన్ కూడా వేయలేదని తెలిపారు. ఉద్యోగాల కోసం ఇందిరాపార్క్ వద్ద పెద్దఎత్తున ఆందోళన చేస్తే 200 మంది డీవైఎఫ్ఐ కార్యకర్తలను అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాల భర్తీ చేపట్టకపోతే నిరుద్యోగులు చేసే ప్రతి పోరాటానికీ సిపిఎం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

కులాంతర వివాహ చట్టం తేవాలి

కులాంతర వివాహాల రక్షణ చట్టం తేవాలని జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని కోరారు. జగిత్యాల జిల్లాలో కులాంతర వివాహం చేసుకున్న మల్లేశ్ అనే యువకుడిని యువతి బంధువులు హత్య చేశారని, ఇప్పటి వరకు కులదురహంకారం పేరుతో రాష్ట్రంలో 42 హత్యలు జరిగాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఇలాంటి దారుణమైన ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జగిత్యాల జిల్లాలో జరిగిన హత్యకు కారకులైన వారిని శిక్షించాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమ కార్యాచరణ

ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో గ్రామాలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటాలు చేయాలని కార్యాచరణ సిద్ధం చేశామని జాన్‌వెస్లీ తెలిపారు. గ్రామానికి 5, 10 మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఇండ్ల స్థలాలు లేనివారు 30 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇంటి స్థలం లేని వారికి ప్రభుత్వ స్థలాలను గుర్తించి 120 గజాలు కేటాయించాలని, ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు, ఎస్సీలకు రూ. ఆరు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు, మహిళలకు రూ.2500 ఇస్తామని ఇప్పటి వరకు అమలు జరగలేదన్నారు. రాజీవ్ యువవికాస్ పేరుతో యువతకు రూ.50వేల నుంచి ఐదు లక్షల వరకు రుణాలు ఇచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామంటే 16లక్షల మందికి పైగా దరఖాస్తులు పెట్టుకున్నారని తెలిపారు. కనీసం ఐదు లక్షల మందినైనా గుర్తించి రుణాలిస్తామని చెప్పిన పాలకులు ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని 10 నుంచి 12 గంటల వరకు పెంచి శ్రమ దోపిడీకి పాల్పడుతోందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు జరగడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా, పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. వెంటనే వీటిని ఉపసంహరించుకోవాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, పనికి తగ్గ వేతనం ఉండాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ ప్రణాళిక సిద్ధం చేయాలి
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

రైతుల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర, జిల్లా స్థాయిలో వ్యవసాయ ప్రణాళిక సిద్ధం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రైతులు ఏ భూమిలో ఏ పంట వేయాలి.. ఎంత మోతాదులో ఎరువులు వాడాలి అనే దానిపై అవగాహన కల్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరముందన్నారు. వెంటనే నాగార్జునసాగర్ ఎడమ కాలువకు సాగు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య కూడా ఉందని, ఎడమ కాలువ ద్వారా నీటిని వదిలితే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని అన్నారు. జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు రావడం లేదని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి అయిలయ్య, డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, ప్రభావతి, వి.వెంకటేశ్వర్లు, ఎండి.హాశం, చిన్నపాక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


పూజ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

బాసర అమ్మవారిని సందర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు

- దశలవారీగా ఆలయాల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలోని శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి సన్నిధికి వచ్చిన మంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు వేద మంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే మహంకాళి, దత్తాత్రేయ స్వామినీ మంత్రి దర్శించుకున్నారు. అనంతరం వసతి గృహంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంత్రికి నిర్మల్ పెయింటింగ్స్ చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని ఆలయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తుందని, బాసర నూతన ఆలయ అభివృద్ధికీ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మాస్టర్ ప్లాన్ అమలుపై ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రితో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతకుముందు ట్రిపుల్‌ఐటీ వసతి గృహంలో మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్‌పి జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్‌డిఓ కోమల్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ పాఠక్, ఇఒ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మమ్మాయి రమేష్, అధికారులు పాల్గొన్నారు.

సిఎం ఢిల్లీ పర్యటనలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- ఎస్ మధుసూదనాచారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలపై శ్వేతపత్రం విడుదల చేయాలని శాసన మండలి ప్రతిపక్ష నేత ఎస్ మధుసూదనాచారి డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారో, ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. శ్వేతపత్రాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను బలిచ్చేందుకే ఢిల్లీ పర్యటనలు చేస్తూ ప్రజలను మోసగిస్తున్నారని ఆయన ఆరోపించారు. లోపాయికారీ వ్యవహారాలు చక్కబెట్టుకునేందుకు ఇంటి నుంచి, రహస్య ఎజెండా కోసం కమాండ్ కంట్రోల్ నుంచి రేవంత్ పాలిస్తున్నారని తెలిపారు. ఢిల్లీకి వెళ్లిన రేవంత్‌కు రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్ దొరకడం లేదని ఎద్దేవా చేశారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా రాష్ట్రాన్ని తిరోగమనంలోకి నడిపించారని మండిపడ్డారు. వ్యవసాయాన్ని కెసిఆర్ పండుగ చేస్తే, విత్తనాలు, ఎరువుల కోసం రైతులు క్యూ లైన్లలో ఉండే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్డినెన్స్‌పై ప్రభుత్వంలో గందరగోళం

బిసి రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి గవర్నర్ వద్దకు పంపించిన ఆర్డినెన్స్ విషయంలో ప్రభుత్వం గందరగోళంలో ఉందని మధుసూదనాచారి ఆరోపించారు. బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో పెట్టి చట్టబద్ధత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ పార్టీలో ఆ పార్టీకి అతీతులెవరు కారని మధుసూదనాచారి స్పష్టం చేశారు. తాము బిఆర్‌ఎస్ తీసుకున్న వైఖరి ప్రకారమే బిసి రిజర్వేషన్లపై మాట్లాడుతున్నట్టు తెలిపారు. ఆ వైఖరికి భిన్నంగా ఎవరైనా మాట్లాడితే వారి విజ్ఞతకే వదిలిపెడుతున్నట్టు చెప్పారు. పార్టీ అన్ని గమనిస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, నవీన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు రాజకీయాలు చొప్పించొద్దు

- హెచ్‌సిఎ గౌరవాన్ని కాపాడాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్రీడల విషయాల్లోకి రాజకీయాలను చొప్పించొద్దనీ, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ గౌరవాన్ని కాపాడాలని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అజారుద్దీన్ హెచ్‌సిఎ అధ్యక్షునిగా ఉన్న సమయంలో జస్టిస్ లావు నాగేశ్వర్ రావు కమిటీ అనేక అక్రమాలు జరిగాయని రిపోర్ట్ ఇచ్చిందనీ, దానిపై ఏమి చర్యలు తీసుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. అజారుద్దీన్, వివేక్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నందునే వారిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

హెచ్‌సీఏను హస్తగతం చేసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి చేసిన కుట్రలో భాగంగానే ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, రేవంత్ అనుచరుడు రోహిన్ రెడ్డి దాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారని తెలిపారు. కొత్తగా వారిద్దరు క్రికెట్ క్లబ్‌లు స్థాపించారనీ, రోహిన్ రెడ్డిని హెచ్‌సీఏ అధ్యక్షున్ని చేసే కుట్ర జరుగుతుందని చెప్పారు. హెచ్‌సిఎ అధ్యక్షులు జరిగిన లావాదేవీలకతు రికార్డులున్నాయని స్పష్టం చేశారు. ఐపిఎల్ ఫుడ్ కాంట్రాక్టులకు కెటిఆర్ బంధువులకు ఇచ్చారనేది పూర్తి అబద్ధమని కొట్టిపారేశారు. కాంట్రాక్టులన్నీ కార్యదర్శి పేరు మీదనే జరుగుతాయని, కార్యదర్శి దేవరాజ్ కాంగ్రెస్ నేత కేశవరావు సన్నిహితుడైనందునే కాపాడుతున్నారా? అని ప్రశ్నించారు. అనేక కేసులున్న అనామకుడు బిజెపి నేత గురువారెడ్డి ఫిర్యాదుపై చీటింగ్ కేసులు ఎలా పెడతారని? నిలదీశారు. రూ.20 కోట్లతో పూర్తి కావాల్సిన ఉప్పల్ స్టేడియం ఖర్చు రూ.వంద కోట్లకు పెరిగిన దానిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ క్రీడా పాలసీని సిఎం రేవంత్ రెడ్డి కాపీ కొట్టారని ఆరోపించారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్‌వి అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బిఆర్‌ఎస్ నేతలు మహిపాల్ ముదిరాజ్, బచ్చు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారామెడికల్ పోస్టుల ఫలితాలు విడుదల చేయాలి

- లేకపోతే ఆగస్టులో పోరాటం తీవ్రతరం : టియుఎంహెచ్‌ఇయు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పారామెడికల్ పోస్టుల ఫలితాలను ఈ నెలాఖరులోగా విడుదల చేసి, నియామకాలు చేపట్టాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టియుఎంహెచ్‌ఇయు) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మాజ్యోతి రావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణిలో యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్ నేతృత్వంలో నిరుద్యోగ అభ్యర్థులు వినతిపత్రం సమర్పించారు. 2024లో విడుదల చేసిన నోటిఫికేషన్లకు సంబంధించి ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులు 1,284, నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టులు 2,322 పోస్టులు, ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 పోస్టులు 732, ఎంపిహెచ్‌ఎ (ఫిమేల్) పోస్టులు 1,931తో కలుపుకుని మొత్తం 6,269 పోస్టులను భర్తీ చేయాల్సి ఉందని వారు గుర్తుచేశారు. ఇవి కాకుండా ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టులను కూడా భర్తీ చేయాలని వారు కోరారు. ఈ నోటిఫికేషన్లకు సంబంధించి రాతపరీక్షలు నిర్వహించి కీ విడుదల చేశారని, ప్రొవిజనల్ లిస్టులు విడుదల చేసి నియామకం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం భూపాల్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఫలితాల కోసం లక్షలాది మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. త్వరలో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ప్రజావాణి అధికారులు తమ వినతిని స్వీకరించి మెడికల్ బోర్డులో బాధ్యులతో మాట్లాడారని, ఫలితాల ఆలస్యానికి సరైన కారణాలను వారు చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేటశారు. జులై ఆఖరు నాటికి ల్యాబ్ టెక్నీషియన్ల తుది మెరిట్ జాబితా, మరో వారంలో స్టాఫ్ నర్సులు, అనంతరం మరో వారంలో ఎఎన్‌ఎంలు, తర్వాత ఫార్మాసిస్టుల ప్రొవిజనల్ జాబితాలు విడుదల చేయనున్నట్టు మెడికల్ బోర్డు నుంచి తెలిపారని వివరించారు. ప్రభుత్వ విధానం మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నోటిఫికేషన్లతో నిరుద్యోగలను భ్రమ పెడతామంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీల్లో కొత్తగా నియమిస్తున్న వారిని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన కాకుండా రెగ్యులర్‌గా తీసుకోవాలని కోరారు. జులై ఆఖరు వరకు వేచి చూస్తామని, అప్పటికీ ఫలితాలు రాకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని భూపాల్ హెచ్చరించారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఎ, వాటర్ వర్క్స్, విద్యుత్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్డీఆర్‌ఎఫ్, హైడ్రా బృందాలు, ఇతర విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇబ్బందుల్లో ఉన్న ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు.

జనరేటివ్ ఎఐపై కెఎల్‌హెచ్‌లో సదస్సు

హైదరాబాద్ : కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్, జనరేటివ్ ఎఐలో గణిత నమూనాపై అంతర్జాతీయ సదస్సును ఏర్పాటు చేసినట్లు ఎల్‌హెచ్ బాచుపల్లి తెలిపింది. జులై 17- 18 తేదిల్లో జరిగిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో కృత్రిమ మేధా, మెరుగైన వ్యూహాలు, ఆరోగ్య సంరక్షణలో జనరేటివ్ ఎఐ వేగంగా అభివృద్ధి చెందుతున్న అప్లికేషన్లలో అత్యాధునిక పరిశోధనను నడిపించే ప్రధాన కార్యక్రమంగా నిలుస్తుందని ఆ సంస్థ పేర్కొంది.

గ్యాస్ డెలివరీ బాయ్స్ సమ్మెకు మద్దతు

- ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్యాస్ సరఫరా కార్మికులు (డెలివరీ బాయ్స్) త్వరలో చేపట్టనున్న సమ్మెకు తమ యూనియన్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 40 వేల మంది గ్యాస్ డెలివరీ బాయ్స్ పనిచేస్తున్నారని, వారు ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు పనిచేస్తున్నారని తెలిపారు. డెలివరీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్న 43 రూపాయల 63 పైసలను ఆయా గ్యాస్ యజమానులు తమ అకౌంట్‌లో జమచేసుకుంటున్నారని, డెలివరీ కార్మికులకు మాత్రం రూ.12 లోపు మాత్రమే చెల్లిస్తున్నారని ఎండగట్టారు. శ్రమదోపిడీని నిరసిస్తూ కార్మికశాఖ అధికారులకుఫిర్యాదులుచేసినా పట్టిచ్చుకోకపోవడాన్ని తప్పుబట్టారు. డెలివరీ బాయ్స్ తమ సొంత ఆటోలను పెట్టి స్వంత డబ్బులతో ఇంధనాన్ని పోసుకొని వినియోగదారులకు సరఫరా చేస్తున్నా యాజమాన్యాలు కార్మికులకు సరైన వేతనాలు చెల్లించకుండా వినియోగదారుల వద్ద వసూలు చేసుకోవాలనిచెప్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఒక్కో ఏజెన్సీ నెలకు రూ. 3 లక్షల నుంచి 4 లక్షల రూపాయలు లాభం పొందుతున్నదని తెలిపారు.

విద్యుదుత్పత్తి పెంచేందుకు చర్యలు

- రీ ఎనర్జబుల్ విద్యుత్‌తో తగ్గిన కాలుష్యం
- బిఆర్‌ఎస్ నేతల భాష మార్చుకోవాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ వినియోగానికి డిమాండ్ పెరుగుతున్నందున దానికి తగినట్టుగా ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2030 సంవత్సరం వరకు 25వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పవర్‌హౌస్‌లో ఉత్పత్తి వివరాలను తెలంగాణ సిఎండి హరీశ్ వివరించారు. తెలంగాణ జెన్కో ఉన్నత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విజయ విహార్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడారు. నాగార్జునసాగర్‌లో విద్యుత్ ఉత్పత్తి చాలా సాంకేతికమైన పరిజ్ఞానంతో ఉన్నదన్నారు. ఆరు దశాబ్దాలకు ముందే ఇక్కడ రివర్స్ పంపింగ్ సిస్టం ఏర్పాటు చేసిన గొప్పతనం కాంగ్రెస్‌దే అని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాబోయే రోజుల్లో పరిశ్రమలు, వాణిజ్యంతోపాటు విద్యుత్ ఉత్పత్తిని కూడా పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో రీ ఎనర్జబుల్ విద్యుత్‌తో కాలుష్యాన్ని తగ్గించామన్నారు. మరికొన్ని ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కోసం తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సోలార్ పవర్ కోసం కూడా అనువైన మార్గాలు అన్వేషిస్తున్నామన్నారు. ఆర్థిక సంపద సృష్టించడం కోసం విద్యుత్ ఉత్పత్తి పెంచే అన్ని రకాల చర్యలూ చేపడతామన్నారు. కొందరు బీఆర్‌ఎస్ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని, ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సాగర్, శ్రీశైలం లాంటి ప్రాజెక్టులు ఏవైనా కట్టారా అని ప్రశ్నించారు. గోదావరిలాంటి పెద్ద నదిపై కూడా ఎలాంటి ప్రయోజనకరమైన ప్రాజెక్టులు కట్టలేకపోయారని ఎద్దేవా చేశారు. సీతారామ ప్రాజెక్టుకు అదనపు నిధులు కేటాయించి వేగవంతం చేశామన్నారు.

బిఆర్‌ఎస్ నాయకుల భాష సరైంది కాదని, ఒక ముఖ్యమంత్రిని పట్టుకొని సన్యాసి అని మాట్లాడటం వారి భాషా నైపుణ్యానికి తార్కాణమని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాల విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పుడు నిద్రపోయిందన్నారు. కృష్ణా జలాల విషయంలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కడుతుంటే ఏం చేసిందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలు నాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ పాల్గొన్నారు.

'సూపర్ అర్జెంట్ క్యాటగిరీ'లో కాలేయమార్పిడి

- దేశంలోనే తొలి ప్రభుత్వాస్పత్రిగా ఉస్మానియా
- వైద్యులకు మంత్రి దామోదర రాజనర్సింహ అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోనే 'సూపర్ అర్జెంట్ క్యాటగిరీ'లో తొలి కాలేయమార్పిడి శస్త్రచికిత్స చేసిన ప్రభుత్వాస్పత్రిగా ఉస్మానియా జనరల్ హాస్పిటల్ రికార్డు నెలకొల్పింది. ప్రాణాపాయస్థితికి చేరుకున్న వారిని బతికించేందుకు అమెరికా, బ్రిటన్ దేశాలతో పాటు యూరోప్ లాంటి చోట్ల ఈ క్యాటగిరీ కింద ప్రాధాన్యతా క్రమంలో అవయవమార్పిడి శస్త్రచికిత్సలు చేస్తుంటారు. మన దేశంలోనూ, మన రాష్ట్రంలోనూ జీవన్‌దాన్‌లో ఈ క్యాటగిరీ అమల్లో ఉంది. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వాస్పత్రుల్లో ఈ క్యాటగిరీ కింద దేశవ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో అవయవమార్పిడి శస్త్రచికిత్స జరగలేదు. తొలిసారిగా హైదరాబాద్ లోని ఉస్మానియా ప్రభుత్వాస్పత్రి బ్లెస్సీ గౌడ్ (17) అనే యువతికి కాలేయమార్పిడి శస్త్రచికిత్సను విజయవంతం చేసింది. దీంతో 48 గంటల్లో కాలేయమార్పిడి చేయకుంటే ప్రాణాలు కోల్పేయే స్థితికి చేరిన ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జి అయింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

హైదరాబాద్ జూబ్లిహిల్స్ ఫిలింనగర్‌లో నివసిస్తున్న బ్లెస్సీ గౌడ్ మే నెలలో జ్వరం బారిన పడింది. ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేరిన ఆమె 5 రోజుల తర్వాత కోమాలోకి వెళ్లింది. ప్రాణాపాయ స్థితిలో మే 12న ఆమె కుటుంబ సభ్యులు బ్లెస్సీని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షల అనంతరం ఆమె కాలేయం పూర్తిగా పాడైనట్టు గుర్తించిన వైద్యులు 48 గంటల్లో కాలేయమార్పిడి చేయకుంటే చనిపోతుందని తేల్చారు. కాలేయదానం చేసేందుకు బ్లెస్సీ తల్లి, ఆమె కుటుంబ సభ్యులు ముందుకొచ్చినప్పటికీ వారి కాలేయం బ్లెస్సీకి మార్పిడి చేసేందుకు సరిపోలడం లేదని వైద్యులు నిర్ధారించారు. కాలేయదాత కోసం జీవన్‌దాన్ సూపర్ అర్జెంట్ క్యాటగిరీలో బ్లెస్సీ పేరును నమోదు చేశారు. అదే సమయంలో ప్రయివేటు ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి బ్లడ్ గ్రూప్, బ్లెస్సీ బ్లడ్ గ్రూప్‌తో సరిపోలడంతో ఆ కాలేయాన్ని జీవన్‌దాన్ అందజేసింది. దీంతో మే 14న ఆస్పత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం హెచ్‌వోడీ మధుసూదన్ నేతృత్వంలోని వైద్యుల బృందం ఆమెకు కాలేయమార్పిడి శస్త్రచికిత్సను విజయవంతం చేసింది. రెండు వారాల తర్వాత బ్లెస్సీని హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకుని, ఫస్ట్ ఇయర్ బీటెక్ ఎగ్జామ్స్‌కు హాజరవుతున్నది. ఈ సందర్భంగా బ్లెస్సీ, ఆమె తల్లి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి దామోదర రాజనర్సింహ అభినందనలు

కాలేయ మార్పిడి శస్త్రచికిత్సను చేసిన సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం హెచ్‌వోడీ మధుసూధన్ తదితర డాక్టర్లను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. బ్లెస్సీని సంపూర్ణ ఆరోగ్యవంతురాలిగా మార్చి, పునర్జన్మ ప్రసాదించారని ప్రశంసించారు. ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులతో సమానంగా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలు అందిస్తున్నామనీ, ఈ సేవలను వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. జీవన్‌దాన్‌ను బలపర్చి, ఆపదలో ఉన్న పేద ప్రజలకు అవయవాలు అందేలా చర్యలు తీసుకున్నామని మంత్రి గుర్తు చేశారు.

సిఎంకు, మంత్రికి కృతజ్ఞతలు : డాక్టర్ మధుసూదన్

ఉచిత కాలేయమార్పిడి చేసేందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు డాక్టర్ మధుసూదన్ కృతజ్ఞతలు తెలిపారు. బ్లెస్సీ గౌడ్ పూర్తిగా కోలుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉస్మానియా వైద్యులతో పాటు, జీవన్ దాన్ వేగంగా స్పందించిందని తెలిపారు.



ఐ అండ్ పిఆర్ కమిషనరేట్‌లో ఘనంగా బోనాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సమాచార, పౌరసంబంధాల శాఖ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంక్‌లో ఉన్న సమాచార్‌భవన్‌లో ఉద్యోగులు, సిబ్బంది సంయుక్తంగా చేపట్టారు. సమాచార శాఖ ఉద్యోగుల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఊరేగింపు, బోనాల సమర్పణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక సమాచార్ భవన్ ప్రాంగణంలో ఉన్న కనకదుర్గ గుడిని సందర్శించారు. పూజ చేశారు. అనంతరం జరిగిన ప్రదర్శనలో కళాకారులు డప్పు విన్యాసాలు, పోతరాజుల ప్రదర్శనతోపాటు పలు కళారూపాలు ప్రదర్శించారు. ఈ ఉత్సవాల్లో సమాచార శాఖ డైరెక్టర్ ఎల్ఎల్ ఆర్ కిషోర్‌బాబు, అదనపు డైరెక్టర్ డిఎస్ జగన్, జెడిలు డి శ్రీనివాస్, కె వెంకటరమణ, మాజీ డైరెక్టర్ సుభాష్‌గౌడ్, సిఐఇ రాధాకిషన్, డిప్యూటీ డైరెక్టర్లు ఎం. మధుసూధన్, సి రాజారెడ్డి, జి ప్రసాద్‌రావు, కెవి సురేష్, ఆర్ఐఇ జయరామ్మూర్తి, సహాయ సంచాలకులు ప్రణీత్‌కుమార్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌లో 77,561 మందికి సీట్ల కేటాయింపు

- ఇంజనీరింగ్‌లో మిగిలిన సీట్లు 5,493
- 82 కాలేజీల్లో వంద శాతం సీట్ల భర్తీ
- సీట్లు రాని అభ్యర్థులు 16,793 మంది
- సిఎస్‌ఇ, ఐటి కోర్సులకే డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) మొదటివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 95,256 మంది అభ్యర్థులు ఎప్‌సెట్ ఇంజనీరింగ్ ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్‌లో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని తెలిపారు. వారిలో 94,354 మంది అభ్యర్థులు 59,31,279 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. రాష్ట్రంలో 172 ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 83,054 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎప్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో 77,561 (93.3 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. ఇంకా 5,493 (6.7 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయకపోవడం, ఇతర కారణాల వల్ల 16,793 మందికి సీట్లు కేటాయించలేదని వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 6,083 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఆరు యూనివర్సిటీ, 76 ప్రయివేటు కాలేజీలు కలిపి మొత్తం 82 ఇంజినీరింగ్ కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వెబ్‌సైట్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా వివరాలను నమోదు చేసేందుకు ఈ నెల 22 వరకు గడువుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో ట్యూషన్ ఫీజు చెల్లించాలని కోరారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకుంటే సీటు రద్దవుతుందని స్పష్టం చేశారు. ఎప్‌సెట్ తుదివిడతలో సీట్లు కేటాయించిన తర్వాత కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. ఈ నెల 31 నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు జిరాక్స్ ప్రతులను, ఒరిజినల్ టిసిని అందజేయాలని కోరారు. రిపోర్టు చేయకుంటే సీటు కోల్పోతారని వివరించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి ట్యూషన్ ఫీజు చెల్లిస్తేనే ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశముంటుందని తెలిపారు. వారే వెబ్‌ఆప్షన్లను నమోదు చేయొచ్చని సూచించారు. రెండో విడతలో సీట్లు పొంది కాలేజీల్లో రిపోర్టు చేయకుంటే తుది విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అనుమతి ఉండబోదని వివరించారు. ఇతర వివరాల కోసం ష్ట్రజూం:7/స్త్రముజూ.ఎవ్.అఱఎ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. అయితే మాక్ కౌన్సెలింగ్ సీట్లు పొందిన వారిలో ఇప్పుడు ఎప్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపులో కాలేజీ, బ్రాంచీ మారిన వారు 36,544 మంది ఉన్నారని వివరించారు.

సిఎస్‌ఇ, ఐటి కోర్సులకు భారీ డిమాండ్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్యలో 47 కోర్సులున్నాయి. 23 కోర్సుల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సిఎస్‌ఇ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) అనుబంధ కోర్సులకు భారీగా డిమాండ్ ఉన్నది. ఆ కోర్సుల్లో చేరేందుకు ఎక్కువ మంది అభ్యర్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. సిఎస్‌ఇ, ఐటి అనుబంధ కోర్సుల్లో 58,743 సీట్లుంటే, 57,042 (97.11 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 1,700 (2.89 శాతం) సీట్లు మిగిలాయి. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అనుబంధ కోర్సుల్లో 16,112 సీట్లుంటే 14,054 (87.23 శాతం) మందికి సీట్లు కేటాయించారు. 2,058 (12.77 శాతం) సీట్లు మిగిలిపోయాయి.

బిఆర్ఎస్‌కు అధికారం దక్కనీయం

- స్థానిక ఎన్నికల్లో ఖమ్మంలో ఒక్క సీటూ రాదు
- కెటిఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్
- మా గురించి సొల్లు కబుర్లుచెప్తే జాగ్రత్త అంటూ హెచ్చరిక
- ఇది దొరల ప్రభుత్వం కాదు.. ప్రజాప్రభుత్వం


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గత ఎన్నికల్లో మాదిరిగానే.. రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్‌కు ఒక సీటు రాదని, రాష్ట్రంలో బిఆర్ఎస్‌కు అధికారం దక్కనీయమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దీనికి నువ్వైనా.. మీ నాన్న అయినా సిద్ధమా అంటూ.. మంత్రి కెటిఆర్‌కు సవాల్ విసిరారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించిన ఇందిరమ్మ మహిళా శక్తి సంబురాల్లో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై పొంగులేటి స్పందించారు. గడచిన పదేండ్లలో అక్రమంగా సంపాదించిన సొమ్ముతో ఇతర దేశాల్లో కాలక్షేపం చేయాలనుకుంటే తమకు అభ్యంతరం లేదని, అంతేగానీ జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఏమీ చేయలేదని సొల్లు కబుర్లు చెప్తే మాత్రం జాగ్రత్త అంటూ హెచ్చరించారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలంలో పేదవానికి ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ రుణాలను ఎగగొట్టిన ఏకైక ముఖ్యమంత్రి కెసిఆర్ అని అన్నారు. కెసిఆర్ హయాంలో 60 వేల ఇండ్లు నిర్మిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఈ 18 నెలల్లో నాలుగు లక్షల ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టిందని తెలిపారు. ఇది దొరల ప్రభుత్వం కాదని.. ప్రజల చేత దీవించబడిన ప్రజా ప్రభుత్వమని అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా పేద ప్రజలకు సన్న బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. దీన్ని చూసి ఓర్వలేకనే.. మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి రేషన్ షాపుల వద్ద ప్రజలు క్యూలో ఉంటున్నారని పేర్కొనడం విడ్డూరంగా ఉందని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బెల్ట్ షాపులు వద్ద క్యూలో ప్రజలు ఉంటే కనిపించని మాజీ మంత్రికి సన్న బియ్యం ఇస్తుంటే కనిపిస్తుందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఎ పిఒ రాహుల్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య, మాజీ జడ్‌పిటిసి బట్టా విజయ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన డిప్యూటీ తహశీల్దార్

- వివాద భూమి విషయంలో రైతు వద్ద రూ.2 లక్షలు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివాదాల్లో ఉన్న భూమిని రైతు పేరిట పట్టా చేసి ఇవ్వాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అత్యాశకు పోయి రైతు వద్ద డబ్బులు డిమాండ్ చేసిన డిప్యూటీ తహశీల్దార్‌పై ఎసిబి అధికారులు కేసు నమోదు చేశారు. సిద్దిపేట జిల్లా మండల కేంద్రంలోని ములుగు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో అధికారులు సోదాలు నిర్వహించారు.

అనంతరం మీడియాకు డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. మండలంలోని సింగన్న గూడలో వివాదాల్లో ఉన్న 16 గుంటల భూమిని రైతు పేరిట పట్టాదారు పొజిషన్ కోసం కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఆ రైతుకు చెందిన 16 గుంటల భూమిని ప్రాసెస్ చేసి, పాస్‌బుక్ ఇవ్వడానికి ఆర్డీవోకు పంపాల్సి ఉండగా ములుగు డిప్యూటీ తహశీల్దార్ ఎనగందుల భవానీ రైతు వద్ద నుంచి రూ.2 లక్షలు డిమాండ్ చేసింది. దాంతో బాధితుడు ఎసిబిని ఆశ్రయించారు. రైతు ఫిర్యాదు మేరకు కార్యాలయంలో సోదాలు నిర్వహించామని, డిప్యూటీ తహశీల్దార్‌పై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నట్టు డీఎస్పీ తెలిపారు.

లారీని ఢీకొట్టిన కారు

- ప్రమాద స్థలంలో నలుగురు, ఆస్పత్రిలో మరొకరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అతివేగంతో వెళ్తు లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే నలుగురు దుర్మరణం చెందారు. మరొకరు ఆస్పత్రిలో మృతి చెందారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగులూరు గేటు సమీపంలో ఓఆర్ఆర్‌పై శుక్రవారం జరిగింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ గ్రీన్‌వాలీ రిసార్ట్‌లో పనిచేసే చందులాల్ (29), జనార్థన్ (50), బాలరాజు (40), కృష్ణ, భాస్కర్ కలిసి యాదగిరి గట్టుకు వెళ్లి తిరిగివస్తుండగా మున్సిపాలిటీ పరిధిలోని బొంగులూరు ఔటర్ రింగ్‌రోడ్డుపై తెల్లవారుజామున మూడు గంటల సమయంలో లారీని వెనుక నుంచి కారుతో ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో నలుగురు ప్రమాద స్థలంలోనే మృతిచెందారు. గాయాలైన వ్యక్తిని బీఎన్ రెడ్డిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. పూర్తి వివరాల తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గోడ కూలి ఇద్దరు కార్మికులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాత ఇంటిని తొలగించే క్రమంలో గోడ కూలి మీద పడటంతో ఇద్దరు కార్మికులు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో శుక్రవారం జరిగింది. బావనపల్లి గ్రామానికి చెందిన పనకంటి శ్రీనివాస్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది.

ఈ క్రమంలో పాత ఇంటిని కూలగొట్టేందుకు కోటపల్లికి చెందిన ఇద్దరు కూలీలను మాట్లాడుకున్నాడు. శుక్రవారం ఇంటిని కూల్చే క్రమంలో గోడ ఒక్కసారిగా కూలి కార్మికులు మధునయ్య, తిరుపతిపై పడింది. తీవ్రంగా గాయపడిన వారిద్దరిని వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలోనే మృతిచెందారు. ఘటన స్థలాన్ని ఎస్ఐ రాజేందర్ పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ఇక్రిశాట్‌తో టాఫే ఒప్పందం

హైదరాబాద్ : ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్మెంట్ లిమిటెడ్ (టాఫే) హైదరాబాద్‌లోని పటాంచెరులోని ఇక్రిశాట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఇక్రిశాట్ క్యాంపస్‌లో 'జెఫార్మ్ అడాప్టివ్ అగ్రికల్చర్ రీసెర్చ్ అండ్ ఎక్స్టెన్షన్ సెంటర్' స్థాపించనున్నట్లు టాఫే పేర్కొంది. ఈ కేంద్రం స్థిరమైన వ్యవసాయం, నీటి సామర్థ్యం, నేల సంరక్షణ, పంట శేషాల నిర్వహణపై దృష్టి సారించనుందని తెలిపింది.

బిజెపి లైన్‌కు విరుద్ధంగా మీడియాలో మాట్లాడొద్దు

- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర నాయకత్వం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వివాదాస్పద అంశాలపైనా, పార్టీలైన్‌కు విరుద్ధమైన అంశాలపైనా మీడియాలో బిజెపి నేతలెవ్వరూ వ్యాఖ్యలు చేయొద్దని రాష్ట్ర నాయకత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్‌రావు సూచనల మేరకు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ నాయకత్వం అనుమతి లేకుండా మీడియా ముందుకెళ్లొద్దని సూచించారు. కేవలం పార్టీ సూచించిన వ్యక్తులే మీడియా వేదికగా మాట్లాడాలని స్పష్టం చేశారు.

కులదురహంకారంతోనే మల్లేశ్ హత్య

- నిందితులను కఠినంగా శిక్షించాలి : టి స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కుల దరుహంకారంతోనే మల్లేశ్‌ను హత్య చేశారనీ, అందుకు బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం కిషన్‌రావు పేటలో నలుగురి మల్లేష్ (26) అదే గ్రామానికి చెందిన బీసీ సామాజిక తరగతికి చెందిన యువతి కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్నారనీ, ఇది నేరంగా భావించిన యువతి తండ్రి, బాబాయి కత్తులతో దాడి చేసి అత్యంత దుర్మార్గం హత్య చేశారని తెలిపారు. కులదురహంకారంతోనే ఈ ఘటనకు పాల్పడ్డారని విమర్శించారు. కుల దురహంకార హత్యలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వీటిని అరికట్టడంలో ఘోరంగా విఫలమవుతున్నదని విమర్శించారు. కులాంతర వివాహాలు చేసుకునే వారి రక్షణ కోసం ప్రత్యేక చట్ట తేవాలని డిమాండ్ చేశారు.

'చేనేత భరోసా' అందరికీ ఇవ్వాలి

- 22, 23, 24 తేదీల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నా
- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గంజి మురళీధర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేనేత భరోసాను జియో ట్యాగ్ కలిగిన అందరికీ ఇవ్వాలని, ఎలాంటి షరతులూ లేకుండా రుణమాఫీ చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై ఈనెల 22, 23, 24 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్టు ప్రకటించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులకు రూ. లక్ష వరకు రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వ హామీని అమలు చేయాలన్నారు. చేనేత కార్మికులకు, అనుబంధ వృత్తుల కార్మికులందరికీ చేనేత భరోసా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కేంద్రాల్లో సబ్సిడీతో నూలు డిపోలు ఏర్పాటు చేసి కార్మికులకు అందించాలని కోరారు. చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు, ఇళ్లు లేని పేదలకు 120 గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల, సహకార సంఘాలలో ఉన్న వస్త్రాల నిల్వలను కొనుగోలు చేయాలన్నారు. 12 సంవత్సరాలుగా సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో నిర్వీర్యమవుతున్నాయని తెలిపారు.

ప్రభుత్వం వెంటనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, టెస్కోకు పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఎనిమిది గంటల పనిదినాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంజి నాగరాజు, దండెంపల్లి సత్తయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కందగట్ల గణేష్, నర్సింగ్‌బట్ల, చేనేత సహకార సంఘం అధ్యక్షులు జెల్లా నరసింహ, జిల్లా సహాయ కార్యదర్శి చెరుకు సైదులు, కర్నాటి శ్రీరంగం ఉన్నారు.

నల్లమల అడవుల్లో పెద్దపులుల సంఖ్య పెరుగుదల

- 250 లొకేషన్లలో 1594 కెమెరాలతో లెక్కింపు : రోహిత్ గోపిడి



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నల్లమల్ల అటవీ ప్రాంతం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో పెద్ద పులుల సంఖ్య గణనీయంగా పెరగడం అభినందనీయమని జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో పెద్దపులులను లెక్కిస్తున్నట్టు తెలిపారు. 2024 డిసెంబర్ 20 నుంచి 2025 మే 15 వరకు పెద్ద పులుల గణన సాగిందని, ప్రస్తుతం 36 పెద్ద పులులు ఉన్నట్టు గుర్తించామని అన్నారు. ఇందులో 20 ఆడపులులు, 13 మగ పులులు ఉన్నాయని, అలాగే రెండు కూనలు ఉన్నట్టు చెప్పారు. 10 ఫారెస్ట్ రేంజ్‌లను నాలుగు భాగాలుగా ఏర్పాటు చేసి పెద్దపులుల సంఖ్యను లెక్కించినట్టు తెలిపారు. 797 గ్రిడ్ ప్రాంతాల్లో పెద్ద పులుల అడుగులు, ముద్రలు, మలమూత్రాలు లెక్కింపునకు ఉపయోగపడే ఇతర ఆధారాలను సేకరించామని అన్నారు. పెద్ద పులుల సంఖ్య పెరగడానికి అటవీశాఖ సిబ్బంది తీవ్రంగా కృషి చేశామన్నారు. పెద్దపులులు సంచరించే ఆవాసాలను రక్షించడం, ప్రధానంగా వేటగాళ్లను నివారించడం ద్వారానే వాటి సంఖ్య పెరిగినట్టు తెలిపారు.

కాజీపేట ఆర్ఎంయు పనులు 70 శాతం పూర్తి

- వరంగల్ రింగురోడ్డు, ఎయిర్‌పోర్టుకు రాష్ట్ర సర్కారు సహకరించాలి : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాజీపేటలో ఏర్పాటు చేస్తున్న రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ (ఆర్ఎంయు) పనులు ఇప్పటికే 60 నుంచి 70 శాతం దాకా పూర్తయ్యాయయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి తెలిపారు. అక్కడ రైలింజన్లు, కోచ్‌లు, వ్యాగన్లు తయారు చేస్తారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ దానిపై ప్రత్యేక దృష్టి సారించారని, ఇప్పటికే రూ.521 కోట్లు మంజూరు చేయగా..మరో రూ.200 కోట్లు ఇచ్చే అవకాశముందని తెలిపారు. ఆర్ఎంయు స్థాపన వరంగల్ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట వరకు రూ.330 కోట్లతో ఎంఎంటిఎస్ విస్తరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. కొమురవెల్లి మల్లన్న ఆలయానికి హైదరాబాద్ నుంచి వేలాది మంది వెళ్లే నేపథ్యంలో అక్కడ కొత్త రైల్వే స్టేషన్ నిర్మాణం చేపట్టామని గుర్తుచేశారు. శంషాబాద్ విమానాశ్రయం తరహాలో రూ. 720 కోట్లతో సికింద్రాబాద్ స్టేషన్ ఆధునీకరణ జరుగుతున్నదని చెప్పారు. వరంగల్ ఎయిర్‌పోర్టుపై గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్ని లేఖలు రాసినా స్పందించలేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా భూసేకరణ పూర్తి చేసి ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టాలని కోరారు.

వరంగల్ రింగురోడ్డు పనుల్లో కేంద్రం 50 శాతం పూర్తిచేసిందనీ, మిగతాది రాష్ట్ర సర్కారు చేయాల్సి ఉందని చెప్పారు. నదీజలాల విషయంలో అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారం కోల్పోయాక ఒకలా మాట్లాడటం బిఆర్ఎస్ నేతలకు సబబు కాదన్నారు. జలవివాదాల పరిష్కారానికి సంబంధించి, రెండు రాష్ట్రాల ఇంజనీర్లు, నిపుణులు, అధికారులతో కలిసి ఒక కమిటీ ఏర్పాటు చేసుకోవాలని ఇటీవల జరిగిన సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైందని చెప్పారు. తెలంగాణ హక్కులకు కేంద్రం ఎలాంటి నష్టం కలిగించబోదని భరోసానిచ్చారు. తెలంగాణకు యూరియా పంపిణీలో కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు.

ఏడాది పూర్తిచేస్తున్న హైడ్రా

బతుకమ్మకుంట వద్ద సంబరాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట పునరుద్ధరణ నేపథ్యంలో కుంట వద్ద పండుగ వాతావరణం ఏర్పడింది. చిన్నారుల చిరునవ్వులతో సందడి నెలకొంది. ఆక్రమణల కబంధ హస్తాలను తెంచి.. చెరువుగా మలిచిన తీరును చూసి చిన్నారులు మురిసిపోయారు. చెత్త, నిర్మాణ వ్యర్థాలతో నిండి.. ముళ్ల పొదలతో భయంకరంగా ఉన్న పరిసరాలు ప్రస్తుతం ఆహ్లాదకరంగా మారడంతో ముచ్చట పడ్డారు. "బతుకమ్మ కుంటకు ప్రాణం పోసిన హైడ్రాకు ధన్యవాదాలు.. చెరువులను రక్షించి.. పర్యావరణాన్ని కాపాడి.. మా భవిష్యత్‌కు బాటలు వేస్తున్న హైడ్రాకు కృతజ్ఞతలు.. నగర రూపురేఖలు మార్చుతున్న హైడ్రాకు అండగా ఉంటాం" అంటూ చిన్నారులు ప్లకార్డులు ప్రదర్శించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు మానవహారంగా చెరువు చుట్టూ నిలబడగా.. స్థానికులు పెద్దఎత్తున వారిని అనుసరించారు. చెరువులను కాపాడుతామని.. ప్రకృతిని పరిరక్షిస్తామని చిన్నారులు ప్రతిజ్ఞ చేశారు. ఇలా బతుకమ్మ కుంట వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమాలు మరిన్ని చెరువుల అభివృద్ధికి ప్రోత్సాహంగా మారాయి.

బతుకమ్మ కుంట ఓ నమూనా : హైడ్రా కమిషనర్ రంగనాథ్

భవిష్యత్‌లో వందలాది చెరువుల పునరుద్ధరణకు అంబర్‌పేట బతుకమ్మ కుంట ఓ నమూనా అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. పర్యావరణ హితమైన నగరాన్ని తీర్చిదిద్దాలనే ప్రభుత్వ సంకల్పానికి బతుకమ్మకుంట నాందీ అని చెప్పారు. హైడ్రా తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బతుకమ్మ కుంట వద్ద మానవహారం నిర్వహించారు. వివిధ పాఠశాలల నిర్వాహకులు, స్థానికులతో కలిసి హైడ్రా కమిషనర్ చిన్నారులనుద్దేశించి ప్రసంగించారు. పరిశుభ్రమైన చెరువులతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని, ఈ క్రమంలో బతుకమ్మకుంటను బతికించుకున్నామని చెప్పారు. రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ ఇలా అన్ని శాఖల సహకారంతో చెరువు నిర్మాణం జరిగిందన్నారు. ఇక్కడ చెరువును పునరుద్ధరించే క్రమంలో తవ్వకాలు జరిపినప్పుడు గంగమ్మ ఉబికి వస్తే.. హర్షించాల్సింది పోయి.. కొంతమంది తాగునీటి పైపులైన్లు పగిలాయంటూ బురదజల్లే ప్రయత్నాలు చేశారన్నారు. ఏడాదిలో 500 ఎకరాల ప్రభుత్వ స్థలాలను పరిరక్షించామన్నారు. హైడ్రా పరిరక్షించిన స్థలాల విలువ దాదాపు రూ.30వేల కోట్లపైనే ఉంటుందని చెప్పారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులకనుగుణంగానే హైడ్రా పని చేస్తోందన్నారు. ఆక్రమణల వెనక చాలా పెద్దవారు ఉన్నారని, వాళ్ల తప్పించుకోవడానికి పేదలను బుల్డోజర్ల ముందు పెడుతున్నారని తెలిపారు. కోట్ల రూపాయల స్థలాన్ని పేదవాళ్లు ఆక్రమిస్తారా? అని ప్రశ్నించారు. నగరం గొలుసుకట్టు చెరువులకు పెట్టింది పేరని, వాటి అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. బతుకమ్మ కుంట అభివృద్ధిని ముఖ్యమంత్రి చాలా దగ్గరగా పరిశీలించారన్నారు. సెప్టెంబరు 21న ఇక్కడ బతుకమ్మ ఉత్సవాలకు ముఖ్యమంత్రి రానున్నారని తెలిపారు.

ఇది ఓ రికార్డు : హైదరాబాద్ కలెక్టర్

తాను జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా ఉన్నప్పుడు ఈ పరిసరాలు డంపింగ్ యార్డుగా ఉండేవని, ఇప్పుడు ఆహ్లాదకరమైన చెరువు కనిపిస్తోందని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. కేవలం 4 నెలల్లో చెరువును రూపొందించడం దేశ చరిత్రలో ఒక రికార్డుగా నిలుస్తుందన్నారు. నాలాలను కూడా పునరుద్ధరించి నగర కీర్తిని చాటాలని కోరారు. భావితరాలకు చెరువులను సజీవంగా అందించడానికి హైడ్రా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

బాల్యం గుర్తొస్తోంది: విహెచ్

బతుకమ్మ కుంట చెరువును చూస్తే తన బాల్యం గుర్తుకొస్తోందని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. హైడ్రా కమిషనర్ మంచి లక్ష్యంతో పని చేస్తున్నారని, అందరం సహకరించాలని కోరారు. 1963 నుంచి ఈ చెరువును పునరుద్ధరించాలని తాను ప్రయత్నించిన విషయాన్ని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, హైడ్రా అధికారులు అశోక్, పాపయ్య, సుదర్శన్, తిరుమల్, శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షులు శంభుల ఉషా శ్రీకాంత్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, ఆర్.లక్ష్మణ్ యాదవ్, నారాయణస్వామి, హైడ్రా సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

- రాష్ట్ర సర్పంచుల సంఘం జెఎసి
- హైదరాబాద్‌లో మహాధర్నా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించి తమ ప్రాణాలు కాపాడాలని రాష్ట్ర సర్పంచుల సంఘం జెఏసి నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ ఎలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సర్పంచులు మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హాజరై సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్పంచులు వడ్డీకి డబ్బులు తెచ్చి గ్రామాలు అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. గత రెండేళ్లుగా వడ్డీ పెరిగిపోతుండటంతో వారు వేధింపులకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు.

సిఎం రేవంత్ రెడ్డి బిల్లులు చెల్లించి సర్పంచుల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. 12,560 మంది సర్పంచులకు సంబంధించి దాదాపు రూ.600 కోట్ల బకాయిలు ఉంటాయని, సిఎం తలుచుకుంటే ఒక్క రోజులో వారి సమస్యలు తీరుతాయన్నారు. సర్పంచులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నాలు చేస్తే ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సూచించారు. జెఏసి అధ్యక్షులు యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించి తమ ప్రాణాలను కాపాడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా కనికరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్రాంతి దళ్ పార్టీ అధ్యక్షులు పృథ్వీరాజ్, సర్పంచ్ జెఏసి ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రంపక నాగయ్య, కోశాధికారి పూడూరి నవీన్ గౌడ్, కేశబోయిన మల్లయ్య, భూమన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులను రెన్యూవల్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ కాలేజీల్లో అతిథి అధ్యాపకులను తక్షణమే రెన్యూవల్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజనీకాంత్, కార్యదర్శి టి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ కాలేజీలు ప్రారంభమై నెలన్నర దాటిందని తెలిపారు. అతిథి అధ్యాపకులను ఇంకా రెన్యూవల్ చేయలేదని పేర్కొన్నారు. దీంతో కొన్ని సబ్జెక్టులకు పాఠాలు బోధించేందుకు అధ్యాపకుల్లేరని తెలిపారు. గత విద్యాసంవత్సరంలో 1,654 మంది అతిథి అధ్యాపకులు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేశారని గుర్తు చేశారు. విద్యార్థులు నష్టపోకుండా వారు సేవలందించారని తెలిపారు. వారిని తక్షణమే రెన్యూవల్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కాలేజీల్లో సిలబస్ పూర్తి చేసి పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తుంటే ప్రభుత్వ కాలేజీల్లో బోధించేందుకు అధ్యాపకుల్లేరని తెలిపారు. తాత్కాలిక పద్ధతిలో అనేక ఏండ్లుగా పనిచేసిన అతిథి అధ్యాపకులను వెంటనే నియమించాలని కోరారు. కాలేజీల ప్రిన్సిపాళ్లు అధ్యాపకులను నియమించాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారని పేర్కొన్నారు.

యూరియాను అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు

- వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి హెచ్చరిక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో యూరియా అక్రమంగా నిల్వలు చేస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి గోపి డీలర్లను హెచ్చరించారు. జిల్లా స్థాయిలో యూరియా, ఇతర ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీ చేయాలని ఒక ప్రకటనలో ఆదేశించారు. ఎవరైనా డీలర్లు, వ్యాపారస్తులు ఎక్కువ మొత్తంలో నిల్వలు చేసి బ్లాక్ మార్కెట్లో అమ్మే ప్రయత్నం చేసే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. రైతుల అవసరాలకుమేరకే యూరియా పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ధారించిన ధర కంటే ఎక్కువ ధరకు యూరియా అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పంపించే కొద్దీ రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. కొన్ని జిల్లాలో రైతులు ఎరువుల కోసం గంటల తరబడి లైన్‌లో నిలబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వరుస క్రమంలో యూరియా పంపిణీ చేస్తామనీ, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విజ్ఞప్తి చేశారు. యూరియా ఎరువుల అక్రమ నిల్వలు, అధిక ధరలకు అమ్మితే ఫిర్యాదు ఈ నెంబర్‌కు 89777-41771 ఫిర్యాదు చేయాలని సూచించారు.

గుండెపోటుతో ప్రభుత్వోపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విధి నిర్వహణలో ఉన్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయునికి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. వెంటనే తోటి ఉపాధ్యాయులు ఆయన్ను ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మృతిచెందారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, తోటి ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పట్టిపల్లి గ్రామానికి చెందిన సోమాచారి (55) పీర్లపల్లి గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో మండలంలోని మునిగడప, తిగుల్, జగదేవపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేశారు. రోజు మాదిరిగానే శుక్రవారం పాఠశాలకు వచ్చారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో ఛాతిలో నొప్పి వచ్చింది. తోటి ఉపాధ్యాయులకు విషయాన్ని చెప్పారు. వారు జగదేవపూర్ మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. నొప్పి తీవ్రమవడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, మండల విద్యాధికారి మాధవరెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం సైదులు, ఉపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు శంకర్ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. సమయపాలన పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వహించే ఒక మంచి ఉపాధ్యాయుని కోల్పోవడం బాధాకరమన్నారు.

బిఎండబ్ల్యు నుంచి కొత్త 2 సిరీస్ గ్రాన్ కూపే

ముంబయి : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బిఎండబ్ల్యు గ్రూప్ ఇండియా మార్కెట్లోకి 2 సిరీస్ గ్రాన్ కూపేను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరాం ప్రారంభ ధరను రూ.46.90 లక్షలుగా నిర్ణయించింది. ఈ సెడాన్ 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజన్, 154 బిహెచ్‌పి, 230 ఎన్ఎమ్ టార్క్‌తో రెండు వేరియంట్‌లలో (218 ఎం స్పోర్ట్, ఎం స్పోర్ట్ ప్రో) అందుబాటులో ఉందని వెల్లడించింది. కొత్త 2 సిరీస్ గ్రాన్ కూపే స్టైల్, టెక్నాలజీ, డ్రైవింగ్ డైనమిక్స్‌లో బిఎండబ్ల్యు స్పోర్టీ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆ కంపెనీ సిఇఒ విక్రమ్ పాహ్ తెలిపారు.

సొంత చెల్లెలు ఫోన్ ట్యాపింగా...

- మాజీ మంత్రి కెటిఆర్‌పై చామల ఆగ్రహం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సొంత చెల్లెలు ఫోన్ ట్యాపింగ్ చేసిన మాజీ మంత్రి కెటిఆర్... ఖమ్మం చౌరస్తాలో కూర్చుని నీతులు చెబుతున్నారని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై ప్రస్తుతం విచారణ జరుగుతున్నదని చెప్పారు. ఈ సమయంలో బిఆర్ఎస్ నాయకులు ఫోన్లు ట్యాపింగ్ అవుతున్నాయంటూ మొసలి కన్నీరు కార్చుతున్నారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ గురించి గూగుల్‌లో సెర్చ్ చేస్తే తండ్రీకొడుకుల పేర్లు వస్తున్నాయని ఆరోపించారు. నీటి కేటాయింపుల్లో మన వాటా మనకు దక్కాల్సిందేనని చెప్పారు. అందు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నదని తెలిపారు. డ్రగ్స్‌తో సంబంధం ఉన్న కేదార్ చనిపోయినట్లు సమాచారముందని చెప్పారు. దుబాయిలో కేదార్‌తో పెట్టుబడులు పెట్టించిందెవరని ప్రశ్నించారు. మిస్ ఇంగ్లాండ్ విషయంలో కెటిఆర్ కామన్‌సెన్స్ లేకుండా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేయడం వల్ల మళ్లీ అధికారంలోకి వస్తామనే పిచ్చి ఆలోచనలో బిఆర్ఎస్ నాయకులు ఉన్నారని తెలిపారు.అలాంటి పగటి కలలు కనొద్దని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క గ్యారంటీ కూడా అమలు చేయలేదంటూ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు.